రహదారి పక్కనే పాడుబడ్డ బావి.. ఎప్పుడు ఏ ప్రమాదమో!

4

ప్రజల గళం... ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం... / నిజం కోసం... నిర్భయంగా... / సమాజం . సమగ్ర అభివృద్ధి

# ప్రజానేస్తం జ్వాల

తెలుగు దినపత్రిక

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 14 బుధవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 7 | పేజీలు : 4 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

WEDNESDAY OCTOBER 14 2026 | VOL:1 | ISSUE: 7 | PAGES:4 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

WANTED REPORTERS
ALL OVER TELANGANA & ANDHRA PRADESH
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
Chenagani Purushotham
9603068864

## ప్రజాస్వామ్యానికి భారత్ తల్లి వంటిది!

- నిరసనలపై ఉక్కుపాదం మోపి ప్రధాని మోదీ వాక్కులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:**

దేశ రాజధానిలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలకు అడ్డుకునే క్రమంలో భద్రతా సిబ్బంది నిరసనకారులపై దాడి చేయడం, వారిని అదుపులోకి తీసుకోవడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడిన తర్వాత ప్రజల ముందుకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యానికి భారత్ తల్లిగా అభివర్ణించారు. మంగళవారం న్యూఢిల్లీలో ప్రారంభమైన బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో మోదీ సుదీర్ఘ ప్రసంగం చేశారు. అధికారం ఎవరి చేతిలో ఉన్నది అనేది అసలు ప్రశ్న కాదు. ఆ అధికారాన్ని ఎలా ఉపయోగిస్తున్నారు అన్నదే అసలు ప్రశ్న అని మోదీ తన



## ఏజెన్సీలోని కానిస్టేబుల్ పోస్టుల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి: కవిత డిమాండ్

- ప్రభుత్వం జారీ చేసిన 2026 పోలీస్ నోటిఫికేషన్‌పై కవిత అభ్యంతరం
- ఈ నిర్ణయంతో గిరిజన యువత 400లకు పైగా పోస్టులు కోల్పోతారని ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి






ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?: కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి ఆగ్రహం

- ప్రజాస్వామ్య హక్కులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్న కిషన్ రెడ్డి
- ఢిల్లీలో కాంగ్రెస్ నిరసనలను అడ్డుకోవడం లేదన్న కేంద్ర మంత్రి
- తెలంగాణలో బీజేపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని ఆరోపణ

# రైతుల సమీక్ష వాయిదా.. ఢిల్లీ పర్యటనకు సీఎం!

- కరువు పరిస్థితులపై సమావేశం రద్దుతో అన్నదాతల్లో అసంతృప్తి
- రైతు వేదికలకు చేరుకున్నాక మారిన ప్రభుత్వ నిర్ణయాలు
- రైతులతో మాట్లాడాల్సిన సీఎం ఢిల్లీ పర్యటనకు వెళ్లడంపై విమర్శలు
- క్షేత్రస్థాయి సమస్యలపై ప్రభుత్వం స్పందించాలంటున్న అన్నదాతలు
- రాజకీయ కార్యక్రమాలకే ప్రాధాన్యమిస్తున్నారంటూ ప్రతిపక్షాల విమర్శలు




**హైదరాబాద్, అక్టోబరు 12:**

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో పంటలు దెబ్బతింటున్న నేపథ్యంలో రైతులకు భరోసా కల్పించేందుకు ఏర్పాటు చేసిన సమీక్షా కార్యక్రమం చివరి నిమిషంలో రద్దు కావడం చర్చనీయాంశంగా మారింది. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని తెలుసుకుని రైతులకు అవసరమైన సహాయక చర్యలపై చర్చించాల్సిన సమయంలో సమావేశం రద్దు కావడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. రైతులతో నేరుగా మాట్లాడేందుకు ప్రభుత్వం ప్రకటించిన కార్యక్రమం అమలు కాకపోవడంతో అన్నదాతలకు నిరాశ ఎదురైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ముందుగా ప్రకటించిన వీడియో కాన్ఫరెన్స్

రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో, కరువు పరిస్థితులపై చర్చించేందుకు అక్టోబరు 12న ఉదయం 11 గంటలకు సచివాలయంలో మంత్రుల అనధికారిక క్యాబినెట్ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అక్టోబరు 9న నోట్ జారీ చేసినట్లు కథనంలో పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి (మిగతా 2వ పేజీలో..)

# నేడు సింగరేణి గర్జన

- గోదావరిఖనిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాంగ్రెస్ మోసాలపై కదం తొక్కనున్న కార్మికులు




గోదావరిఖని, అక్టోబర్ 13:

అధికారంకోసం హామీలిచ్చి గద్దెనెక్కగానే మొండిచెయ్యి చూపిన కాంగ్రెస్‌పై కదంతొక్కేందుకు సింగరేణి కార్మికలోకం సిద్ధమవుతున్నది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే 'సింగరేణి కార్మిక గర్జన' భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తికాగా పెద్ద సంఖ్యలో తరలివచ్చేందుకు నల్ల సూర్యులు ఉత్సాహంగా ఉన్నారు. దాదాపు 30 వేల మంది పాల్గొంటారని భావిస్తున్న సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

రెండు రోజులుగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు సభ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీశ్‌రెడ్డి, కౌశిక హరి, కోలేటి దామోదర్, మూల విజయారెడ్డి సభ విజయవంతం కోసం విశేషంగా కృషి చేస్తున్నారు.



## రైతు డిస్కమ్‌పై హరీశ్ రావు ఫైర్.. ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే కుట్రేనని ఆరోపణ

- రైతు డిస్కమ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం జీవో 17 జారీ ఇది ఉచిత విద్యుత్‌ను నీరుగార్చే కుట్రేనని ఆరోపించిన హరీశ్ రావు
- జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- సౌర, జల విద్యుత్‌పై ఆధారపడి 24 గంటల కరెంట్ ఎలా సాధ్యమని ప్రశ్న
- కొత్త డిస్కమ్‌పై అప్పుల భారం మోపడంపై ఆందోళన

తెలంగాణలో రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కమ్' ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 17పై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది వ్యవసాయానికి




కరెంట్, నీళ్లు ఇవ్వలేరు కానీ.. బుల్లెట్ ట్రైన్లు గురించి మాట్లాడుతున్నారు: సబితా ఇంద్రారెడ్డి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్ర విమర్శలు
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ ఖరారు కాకుండానే భూసేకరణ చట్టవిరుద్ధమని ఆరోపణ
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేల ఎకరాలు బలవంతంగా లాక్కుంటున్నారని ధ్వజం

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో



## కేంద్రంపై ఉమ్మడి పోరాటం.. మోదీ, షా చుట్టూ ఉచ్చు బిగుస్తోంది: రాహుల్ గాంధీ

- ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం తమ పోరాటం ఆగదని స్పష్టం చేసిన విపక్షాలు
- నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్ హోదా రద్దును తీవ్రంగా ఖండన
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- రాహుల్ గాంధీ నాయకత్వంలో ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించిన కూటమి నేతలు

ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని విపక్షాలు మంగళవారం స్పష్టం చేశాయి. న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు ఎలాంటి పాత్ర పోషించినా, పోషించకపోయినా తమ ప్రతిఘటన ఆగదని తేల్చిచెప్పాయి. నిరసనల వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేయాలన్న ప్రభుత్వ

## విజయవాడలో తెలుగులో ప్రసంగించిన సీఎం విజయ్..

బెజవాడలో విజయవాడ ఉత్సవ్ 2.0 హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

## రైతు డిస్కమ్‌పై హరీశ్ రావు ఫైర్.. ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే కుట్రేనని ఆరోపణ

ఉచిత విద్యుత్‌ను దూరం చేసే కుట్ర అని ఆయన ఆరోపించారు. ఈ జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, ఇతర రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు, రైతుల అభ్యంతరాలను కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని హరీశ్ విమర్శించారు. "రైతు డిస్కమ్ ఏర్పాటు జీవో జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనం. ఉచిత విద్యుత్ సరఫరాకు పాతరేసి, అన్నదాత మెడకు ఉరేసేందుకేనా ఈ కుట్ర?" అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ జీవో ప్రకారం 30,60,861 వ్యవసాయ కనెక్షన్లు, 512 ఎత్తిపోతల పథకాలతో పాటు ఎవీబౌరాదీ, మిషన్ భగీరథ కనెక్షన్లు కలిపి మొత్తం 30,62,853 కనెక్షన్లను కొత్త డిస్కమ్‌కు బదిలీ చేస్తున్నారని హరీశ్ రావు తెలిపారు. ఇంత పెద్ద వ్యవస్థను కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు. కొత్త డిస్కమ్‌కు కేవలం 25 శాతం థర్మల్ విద్యుత్‌ను కేటాయించి, 58 శాతం సౌర, మిగిలింది జల విద్యుత్‌పై ఆధారపడటం అవివేకమన్నారు. సౌర విద్యుత్ పగలు మాత్రమే అందుబాటులో ఉంటుందని, జల విద్యుత్ ఏడాదిలో మూడు, నాలుగు నెలలే లభిస్తుందని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ ఎలా సాధ్యమవుతుందని సందేహం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడే సంస్థపై అప్పులు, బకాయిల భారం మోపడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం కొత్త సంస్థలను ఏర్పాటు చేస్తే రైతుల కరెంట్ కష్టాలు తీరవని, వెంటనే జీవో 17ను వెనక్కి తీసుకుని, ఉచిత విద్యుత్ కొనసాగింపుపై రాతపూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కరెంట్, నీళ్లు ఇవ్వలేరు కానీ.. బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడుతున్నారు: సబితా ఇంద్రారెడ్డి

మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా అలైన్‌మెంట్ ఖరారు చేయని బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం పూర్తిగా చట్టవిరుద్ధమని ఆమె మండిపడ్డారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటనను ప్రస్తావిస్తూ, బుల్లెట్ ట్రైన్ రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదని, అలాంటప్పుడు బహదూర్‌గూడలో పోలీసుల రక్షణతో రైతుల భూములను ఎందుకు తీసుకున్నారని సబిత ప్రశ్నించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలను ప్రభుత్వం అనవసరంగా సేకరిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డికి ఇంత భూదాహం ఎందుకో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను పంటలు వేయవద్దని సలహా ఇస్తోందని... కనీసం కరెంట్, సాగు, తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ఉందని ఆమె విమర్శించారు. మెట్రో టెండర్లు రద్దు చేసిన ప్రభుత్వం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్‌కు కొత్త రహదారి అవసరం ఏముందని నిలదీశారు. భూములు అమ్మి పాలన చేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. నాదర్‌గూల్‌లోని ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, భూసేకరణ ఒత్తిడితో కొడంగల్ నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇలాంటి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆమె హితవు పలికారు.

## కేంద్రంపై ఉమ్మడి పోరాటం.. మోదీ, షా చుట్టూ ఉచ్చు బిగుస్తోంది: రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి)

నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రకటించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీతో పాటు ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, సీపీఎం, సీపీఐ, తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) సహా 'ఇండియా' కూటమికి చెందిన పలువురు కీలక నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, పౌర సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల అనంతరం, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు రాహుల్ ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "మాకు సుప్రీంకోర్టు, ప్రధాన న్యాయమూర్తి, న్యాయవ్యవస్థపై అపారమైన గౌరవం ఉంది. వారు తమ బాధ్యతను నిర్వర్తిస్తారని ఆశిస్తున్నాం. ఏ వ్యవస్థ స్పందించినా, స్పందించకపోయినా మా రాజకీయ, ప్రజా ప్రతిఘటన కొనసాగుతుంది, అంతిమంగా విజయం సాధిస్తుంది" అని అన్నారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసి అంత సులభంగా తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. ఓట్ల దొంగతనానికి పాల్పడిన వారిపై చర్యలు తప్పవని పునరుద్ఘాటించారు. "ఈ కుట్రకు ప్రధాన రూపశిల్పి మోదీ కాగా, అమలు చేసిన వ్యక్తులు అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ అని, వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని వారు గ్రహించాలి. వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని హామీ ఇస్తున్నాం" అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

జంతర్ మంతర్‌పై పోరాటం

నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్ హోదాను ప్రభుత్వం రద్దు చేయడాన్ని పలువురు నేతలు తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వంలోని భయం ఈ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శించారు. జంతర్ మంతర్‌ను తిరిగి దక్కించుకోవడానికి పోరాడతామని సీపీఐ నేత డి. రాజా ప్రకటించారు. రాబోయే రోజుల్లో 'ఇండియా' కూటమి చేపట్టే ప్రతీ కార్యక్రమంలోనూ జంతర్ మంతర్ వైపు మార్చ్ చేసే ప్రయత్నం ఉంటుందని కూటమి వర్గాలు తెలిపాయి. సీపీఎం పొలిట్‌బ్యూరో సైతం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. శాంతియుత నిరసన హక్కును బలహీనపరిచేందుకే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని ఆరోపించింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఇతర నేతలు సైతం బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజ్యాంగం ప్రమాదంలో పడటంతోనే ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమయ్యాయని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. 'ఓట్ల దొంగతనం'లో పాలుపంచుకున్న జ్ఞానేశ్ కుమార్, ఇతర అధికారులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని తృణమూల్ నేత సాగరిక ఘోష్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఈసీని పదవి నుంచి తప్పించే వరకు

# రైతుల సమీక్ష వాయిదా.. ఢిల్లీ పర్యటనకు సీఎం!

మొదటి పేజీ తరువాయి)

గంటకు సచివాలయం ఆరో అంతస్తు నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల ద్వారా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మంత్రులు పాల్గొని క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటారని, రైతులకు భరోసా కల్పిస్తారని సమాచారం ఇచ్చారు.

గంటగంటకూ మారిన సమాచారం

ప్రభుత్వ ప్రకటన మేరకు వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లోని రైతులకు సమాచారం అందించారు. రైతులు రైతు వేదికలకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. అయితే సమావేశ సమయం సమీపిస్తున్న కొద్దీ నిర్ణయాల్లో మార్పులు చోటుచేసుకున్నట్లు సమాచారం. ఉదయం 9.52 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ రద్దయినట్లు సందేశం పంపగా, ఆ తర్వాత ఉదయం 11.15 గంటలకు సమావేశం ఉంటుందని మరో సమాచారం అందినట్లు కథనం వెల్లడించింది. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు సమావేశం జరుగుతుందని, ముఖ్యమంత్రి బదులుగా ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి పాల్గొంటారని తెలిపినట్లు పేర్కొంది. వరుస మార్పులతో రైతులు, క్షేత్రస్థాయి సిబ్బందిలో గందరగోళం నెలకొన్నట్లు తెలుస్తోంది.

రైతులు ఎదురుచూస్తుండగా ఢిల్లీకి సీఎం

ఒకవైపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతుండగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోవా పర్యటన అనంతరం ఢిల్లీకి వెళ్లారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కూడా ఢిల్లీ పర్యటనకు వెళ్లినట్లు కథనం పేర్కొంది. ఢిల్లీలో నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకే నాయకులు వెళ్లినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నప్పటికీ, పార్టీ అంతర్గత వ్యవహారాలు, పదవుల అంశాలపై అధిష్ఠానంతో చర్చించేందుకే వెళ్లారనే ప్రచారం కూడా సాగుతోందని కథనం పేర్కొంది. ఈ ప్రచారంపై స్వతంత్ర నిర్ధారణ లేనందున దాన్ని ఆరోపణగానే చూడాల్సి ఉంటుంది.

పంటల పరిస్థితిపై తక్షణ చర్యలు అవసరం

వర్షాలు తగ్గడం, సాగునీటి కొరత, పంటలు ఎండిపోవడం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో సమీక్షా సమావేశాల నిర్వహణ, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం కీలకంగా మారాయి. రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకోవడం, పంట నష్టాన్ని అంచనా వేయడం, అవసరమైన సహాయం అందించేందుకు కార్యాచరణ రూపొందించడం అత్యవసరం. సమావేశం రద్దు కావడానికి గల కారణాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పాటు, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ సమీక్షా కార్యక్రమాన్ని నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

## ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?: కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్య హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు స్వేచ్ఛగా నిరసనలు చేస్తుంటే అనుమతిస్తున్నామని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో రైతుల సమస్యలు, పోలీసు నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వంటి ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో సహా పలువురు నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రధాని మోదీని, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను, సైన్యాన్ని విమర్శిస్తున్నా ఆయన హక్కులను కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులు... తెలంగాణలోని బీజేపీ నేతలకు ఎందుకు ఉండవు? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుంటే సరిపోదని, అధికారంలో ఉన్నప్పుడు దానిని ఆచరించాలని హితవు పలికారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దని ఆయన గుర్తుచేశారు.

## ఏజెన్సీలోని కానిస్టేబుల్ పోస్టుల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి: కవిత డిమాండ్

మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ పోస్టుల్లో షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆమె కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1988లో జారీ చేసిన జీవో 109, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2018లో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ 49 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కవిత పేర్కొన్నారు. అయితే, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల జారీ చేసిన 2026 పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో ఈ నిబంధనను అమలు చేయలేదని ఆమె ఆరోపించారు. దీనివల్ల ఆదివాసీ, గిరిజన యువత కానిస్టేబుల్ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. గతంలో 2015, 2018, 2022 సంవత్సరాల్లో విడుదలైన కానిస్టేబుల్ నోటిఫికేషన్లలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజన యువతకు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. కానీ, 2026 నోటిఫికేషన్‌లో ఎందుకు అమలు చేయడం లేదని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నిర్ణయంతో ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని గిరిజన యువత 400కు పైగా కానిస్టేబుల్ పోస్టులను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. హోంమంత్రిత్వ శాఖను కూడా పర్యవేక్షిస్తున్న రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, 2026 కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో అవసరమైన సవరణలు చేసి ఆదివాసీ, గిరిజన యువతకు పూర్తి న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# నేడు సింగరేణి గర్జన

మొదటి పేజీ తరువాయి)

సభకు రామగుండం, మంథని నియోజకవర్గాలతోపాటు మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలిరానున్నారు.

6,324 కోట్లు ఏమైనయ్? : కొప్పుల

' కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పేరిట రెండేండ్లుగా సింగరేణి లాభాల్లోంచి పక్కన పెట్టిన రూ.రూ.6,324 కోట్లు ఏమైనయి? ఎక్కడ ఖర్చుపెట్టారో చెప్పాలి' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. మంగళవారం గోదావరిఖనిలోని సింగరేణి స్టేడియంలో సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కార్మికుల జీతాలు, సంక్షేమం కోసం ప్రతి నెలా రూ.4 వేల కోట్లు ఓడీ రూపంలో తెస్తున్నామని చెప్తు న్న ప్రభుత్వం, ఇంత పెద్ద మొత్తంలో నిల్వ లు ఉన్నా మళ్లీ ఓడీలు ఎందుకు తేవాల్సి వస్తున్నదని నిలదీశారు. ఇది కార్మికులను మోసం చేసే పెద్ద స్కామ్ అని, దీనిపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం సింగరేణి కార్మిక గర్జన నిర్వహిస్తున్నందునే ప్రభుత్వం దిగివచ్చి కేటీఆర్ సభకు ముందే మంగళవారం లాభాల వాటాను ప్రకటించిందని చెప్పారు.

సింగరేణిని భ్రష్టు పట్టించిండ్రు : బాల్క సుమన్

కాంగ్రెస్ సర్కార్ సింగరేణి సంస్థను భ్రష్టుపట్టించిందని ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్ విమర్శించారు. సోలార్ ప్లాంట్లు, డీజిల్, పెట్రోల్ కొనుగోళ్లు, ఓబీ వర్క్ టెండర్లు, ఎక్స్‌ప్లోజివ్‌ల కొనుగోళ్లలో విపరీతమైన కుంభకోణాలకు పాల్పడుతూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని చెప్పారు.

## విజయవాడలో తెలుగులో ప్రసంగించిన సీఎం విజయ్..

మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్.. విజయవాడలో తెలుగులో ప్రసంగించి అందరి హృదయాలను గెలుచుకున్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో అట్టహాసంగా జరుగుతున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0' వేడుకలకు ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్, కాస్త తడబడుతూనే తెలుగులో మాట్లాడటం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "అందరికీ నమస్కారం. మిమ్మల్ని అందరినీ కలిసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అంటూ విజయ్ తన ప్రసంగాన్ని మొదలుపెట్టగానే అక్కడున్న యువత కేరింతలతో హోరెత్తించారు. తన పర్యటన ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరిస్తూ, "నదుల అనుసంధానం గురించి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారితో చర్చించేందుకు విజయవాడ వచ్చాను" అని స్పష్టం చేశారు. తన ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ, తనను ఆహ్వానించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, విజయవాడ ఉత్సవ్‌తో నగరంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొందని నిర్వాహకులను అభినందించారు. తమిళనాడు సీఎంగా గెలిచిన తర్వాత విజయ్ మొదటిసారి విజయవాడ రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రాలు వేరైనా తమ అభిమతం ఒక్కటేనని, దేశం బాగుపడాలని చంద్రబాబు అన్నారు. ఈ వేడుకలకు హాజరైన సీఎం విజయ్‌కు, కళాకారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



# వరంగల్‌లో విద్యా సంక్షోభం

**ఐదు తరగతులకు ఒక్కరే టీచర్.. 879 పాఠశాలల్లో ఏకోపాధ్యాయ వ్యవస్థ**

**జీవో 25 సవరించి, ప్రతి తరగతికి ప్రత్యేక ఉపాధ్యాయుడిని నియమించాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్**

**హనుమకొండ, ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి మారెల్లి కిరణ్:**



ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత విద్యాబోధనపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జిల్లాలోని మొత్తం 4,293 పాఠశాలల్లో 879 బడులు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు బోధించాల్సి రావడంతో బోధనాభ్యసన ప్రక్రియ సవాళ్లను ఎదుర్కొంటోంది.

**బహుళ తరగతుల బోధనతో ఇబ్బందులు**

ఒకే ఉపాధ్యాయుడు వేర్వేరు తరగతులకు పాఠాలు చెప్పడంతో ప్రతి తరగతిపై తగినంత సమయం కేటాయించడం కష్టతరమవుతోంది. విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించడం, సందేహాలను నివృత్తి చేయడం, పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో బోధించడం వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. దీనివల్ల విద్యార్థులకు అందాల్సిన నాణ్యమైన విద్యపై ప్రభావం పడే అవకాశం ఉందని విద్యావర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

జీవో 25పై అభ్యంతరాలు

జీవో 25 నిబంధనల ప్రకారం 19 మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలకు ఒక్క ఉపాధ్యాయుడిని కేటాయిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ విధానం చిన్న పాఠశాలల్లో బహుళ తరగతుల బోధన భారాన్ని పెంచుతోందని ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. విద్యార్థుల సంఖ్య ఆధారంగా మాత్రమే కాకుండా, తరగతుల సంఖ్యను కూడా పరిగణనలోకి తీసుకొని ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని కోరుతున్నాయి.

ప్రభుత్వం స్పందించాలి

ప్రాథమిక విద్య పునాది బలంగా ఉండాలంటే ప్రతి విద్యార్థికి తగిన బోధన అందడం అత్యవసరం. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జీవో 25ను సవరించి, అవసరానికి అనుగుణంగా అదనపు ఉపాధ్యాయులను నియమించాలని, ప్రతి తరగతికి తగిన బోధనా సదుపాయాలు కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని కోరుతున్నాయి.

# మాన్కాపూర్ అసైన్డ్ భూముల వివాదంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆగ్రహం

**నోటీసులు ఇచ్చినా ఆగని అక్రమాలు.. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు**

**భూములను పరిరక్షించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**నార్నూర్, ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి:**



ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాన్కాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 94/3, 94/3/అ పరిధిలోని అసైన్డ్ భూముల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి రామారావు ఆరోపించారు. సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ కొందరు తమ చర్యలను కొనసాగిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు.

నిషేధిత జాబితాలో ఉన్న భూములపై వివాదం

రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22- కింద నిషేధిత జాబితాలో ఉన్నట్లు పేర్కొంటున్న ఈ భూముల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రామారావు డిమాండ్ చేశారు. భూముల పరిరక్షణలో సంబంధిత రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆయన, అధికారుల స్పందన లేకపోవడం వల్లే సమస్య కొనసాగుతోందని ఆరోపించారు.

తక్షణమే చర్యలు తీసుకోవాలి

మాన్కాపూర్ గ్రామంలోని అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, భూముల హద్దులు, యాజమాన్య వివరాలను నిర్ధారించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కోరారు. అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ ఫిర్యాదులపై అధికారులు స్పందించకపోతే తెలంగాణ హైకోర్టును ఆశ్రయిస్తామని రామారావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి రామారావు, నార్నూర్ మండల అధ్యక్షుడు ఆర్క గోవింద్ రావు, ఏవీఎస్పీ ప్రధాన కార్యదర్శి సెడ్మకి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల హక్కుల సాధనకు ఆధార్ పార్టీ పోరాటం

**బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ నిధులు వారికే ఖర్చు చేయాలి**

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి సిద్ధం: డా. ఈడా శేషగిరిరావు**

**మణుగూరు, ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి:**

గిరిజనుల హక్కుల సాధనతో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆధార్ పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఈడా శేషగిరిరావు అన్నారు. మంగళవారం మణుగూరు మండల కేంద్రంలో కల్తీ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన పినపాక నియోజకవర్గ ఆధార్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**సామాజిక న్యాయమే లక్ష్యం**

రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు ఆధార్ పార్టీ ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందని శేషగిరిరావు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల పక్షాన నిలవాలని పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభివృద్ధి కోసం కేటాయించే బడ్జెట్ నిధులను పూర్తిస్థాయిలో ఆయా వర్గాల సంక్షేమానికే వినియోగించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు.

**119 అసెంబ్లీ స్థానాల్లో పోటీ**

తెలంగాణలో ఆధార్ పార్టీని బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని శేషగిరిరావు కోరారు. 2028లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పోటీకి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఆధార్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబోజి బుడయ్య, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు అల్లెం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండ రాజారామ్, రాష్ట్ర చేరికల కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోడేటి దుర్గాప్రసాద్ గౌడ్, కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తయ్య దొర, కార్యదర్శి నరేష్, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి కల్లూరి రాణి, కొత్తగూడెం ఇన్‌చార్జి ప్రేమ్ దయాళ్, ఇల్లందు ఇన్‌చార్జి అల్లెం రామ, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కుక్కల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు తల్లాడ వెంకన్న, అంబోజు రవి, కొప్పుల సునీల్, ఈడ శ్రీనివాస్, బొంగోని గణేష్, జనగాం సరిత, వెంకట కృష్ణ తదితరులు హాజరయ్యారు.




# చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్

**నవంబర్ 21న హనుమకొండ, పరకాల కోర్టుల్లో నిర్వహణ.. 78 కేసుల గుర్తింపు**

**హనుమకొండ, (ప్రజానేస్తం జ్వాల):**



చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసం నవంబర్ 21న హనుమకొండ, పరకాల కోర్టుల్లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మంత్రి రామకృష్ణ సునీత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రాజీకి అవకాశం ఉన్న 78 ఎన్ఐ యాక్ట్ కేసులను గుర్తించినట్లు వెల్లడించారు. హనుమకొండలో నాలుగు, పరకాలలో ఒక బెంచ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కక్షిదారులు పరస్పర అంగీకారంతో కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

# ముందస్తు సమాచారం లేకుండానే షాపుల కూల్చివేత!

- **కేయూ క్రాస్‌రోడ్డు వద్ద చిరు వ్యాపారుల ఆవేదన.. అప్పులు చేసి తెచ్చిన సరుకులు ధ్వంసం**

**హనుమకొండ,( ప్రజానేస్తం జ్వాల):**



హనుమకొండ కేయూ క్రాస్‌రోడ్డు జంక్షన్ నుంచి కేయూ రెండో గేటు వరకు రోడ్డుపక్కన చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను మంగళవారం ఉదయం మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, సామాన్లు సర్దుకునే అవకాశం కల్పించకుండా షాపులు తొలగించారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి తెచ్చిన పండ్లు, ఇతర సామగ్రి ధ్వంసమై జీవనోపాధి కోల్పోయామని కన్నీరుమున్నీరయ్యారు. అయితే, ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో అక్కడ వ్యాపారాలు నిర్వహించవద్దని నెలలుగా చెబుతున్నామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

# ఎనుమాముల మార్కెట్‌లో పెరిగిన పత్తి, మిర్చి ధరలు!

- **క్వింటా పత్తి రూ.9,160.. వండర్ హాట్ మిర్చి రూ.32,500**

**హనుమకొండ, (ప్రజానేస్తం జ్వాల):**



వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పత్తి, కొన్ని రకాల మిర్చి ధరలు పెరిగాయి. క్వింటా పత్తి ధర సోమవారం రూ.9,060 ఉండగా, మంగళవారం రూ.9,160కు చేరింది. వండర్ హాట్ మిర్చి ధర రూ.30 వేల నుంచి రూ.32,500కు పెరిగింది. తేజ మిర్చి క్వింటా రూ.21,200, 341 రకం రూ.25 వేలు, టమాటా మిర్చి రూ.38 వేల వద్ద స్థిరంగా కొనసాగినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

# ములుకనూరు సహకార సంఘాన్ని సందర్శించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

- **సంఘం కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్న తౌటం రోహిత్ నేత**

**భీమదేవరపల్లి, ప్రజానేస్తం జ్వాల:**



హనుమకొండ జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తౌటం రోహిత్ నేత భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరు సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం జనరల్ మేనేజర్ ఎం. రాంరెడ్డి సంఘం నిర్వహిస్తున్న కార్యకలాపాలు, రైతులకు అందిస్తున్న సేవలు, ఇతర కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు ఆది రెడ్డి, భీమదేవరపల్లి మండల వ్యవసాయ అధికారి పద్మ, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు కమలహాసన్, సంతోష్‌తో పాటు సంఘ వ్యవసాయ అధికారులు సంగ శ్రీనివాస్, ముచ్చ అచ్యుత రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా దుర్గామాత అన్నప్రసాద వితరణ

**నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ**

**పొనుగోడు,అక్టోబర్ 13 (ప్రజానేస్తం జ్వాల ):**




సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దుర్గామాత కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని యర్రంశెట్టి వెంకన్న గురుస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జూలకంటి నరేష్ స్వామి, నేలపట్ల అశోక్ స్వామి, కొమ్రరాజు లచ్చది స్వామితో పాటు అయ్యప్ప, దుర్గామాత, నరసింహస్వామి, శివయ్య మాలధారణ స్వాములు, దుర్గామాత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

## అంతర్జాతీయ కరాటే పోటీలకు టీమ్ కోచ్‌గా మాడుగుల ప్రవీణ్

**శ్రీలంకలో ఈ నెల 17, 18 తేదీల్లో పోటీలు**

**ముస్తఫాపూర్ యువకుడికి అభినందనల వెల్లువ**

**భీమదేవరపల్లి, ప్రజానేస్తం జ్వాల:**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముస్తఫాపూర్ గ్రామానికి చెందిన మాడుగుల ప్రవీణ్ అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు టీమ్ కోచ్‌గా ఎంపికయ్యారు. శ్రీలంకలోని వేన్నపువ్వ నగరంలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఆయన కోచ్‌గా వ్యవహరించనున్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు మండల నాయకులు, గ్రామస్థులు ప్రవీణ్‌ను అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో టీమ్ కోచ్‌గా ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని పేర్కొంటూ, ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.మాడుగుల ప్రవీణ్ సాధించిన ఈ గుర్తింపుపై ముస్తఫాపూర్ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

- **ఓట్ల చోరీకి వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీ, జిల్లాలో చేపట్టిన నిరసనలపై సీఎంకు వివరణ**



**న్యూఢిల్లీ, ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్, మంచిర్యాల డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్‌నాయక్ తదితరులతో కలిసి ఆమె ఈ భేటీలో పాల్గొన్నారు.

ఢిల్లీ ర్యాలీ వివరాలు వెల్లడి

ఢిల్లీలో ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సోమవారం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆత్రం సుగుణక్క, ఆ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు వివరించారు. ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం తదితర అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

జిల్లాలో నిరసన కార్యక్రమాలపై చర్చ

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల వివరాలను కూడా ఆత్రం సుగుణక్క ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణుల భాగస్వామ్యం, ప్రజల స్పందన తదితర అంశాలను వెల్లడించారు.

## సర్వారంలో దొంగల బీభత్సం.. ఇంటి తాళం పగలగొట్టి రూ.70 వేల నగదు, బంగారం చోరీ!

**అమ్మవారి ఉత్సవాలకు వెళ్లిన సమయంలో ఘటన.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీకాంత్ వెల్లడి**

**సర్వారం, అక్టోబర్ 13 (ప్రజానేస్తం జ్వాల):**




సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం సర్వారం గ్రామంలో చోరీ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సుశీల అక్టోబర్ 12వ తేదీ రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి అమ్మవారి ఉత్సవాలను చూసేందుకు వెళ్లారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వెనుక తలుపును పగలగొట్టి లోపలికి ప్రవేశించారు.అనంతరం ఇంట్లోని బీరువాను గ్రామ శివారులోకి తీసుకెళ్లి పగలగొట్టి, అందులో ఉన్న రూ.70 వేల నగదు, అర తులం బంగారాన్ని అపహరించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు.ఈ ఘటనపై గరిడేపల్లి ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీకి పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించేందుకు విచారణ చేపట్టినట్లు తెలిపారు.

## హుజూర్‌నగర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల చర్యలు





**రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై హెచ్చరిక.. ఉల్లంఘనలకు చలానాలు, కేసులు**

**పాత బస్టాండ్ పరిసరాల్లో పార్కింగ్ క్రమబద్ధీకరణపై దృష్టి**

**హుజూర్‌నగర్, ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి:**

హుజూర్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నియంత్రణ, రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. పట్టణంలోని పాత బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడటంపై ప్రత్యేక దృష్టి సారించారు.మంగళవారం పాత బస్టాండ్ ఎదురుగా ఎన్‌సీఎల్ పరిశ్రమకు చెందిన బస్సు ఢీకొనడంతో రిక్షా కార్మికుడు పిట్టల రమణ (70) మృతి చెందిన ఘటన నేపథ్యంలో ఆ ప్రాంతంలో రహదారి భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే, ఈ ప్రమాదానికి ట్రాఫిక్ సమస్యలు లేదా రహదారి ఆక్రమణలే కారణమని నిర్ధారణ కాలేదు.

సీఐ ఆదేశాలతో పోలీసుల చర్యలు

సీఐ చరమంద రాజు ఆదేశాల మేరకు ఎస్ఐలు చలికంటి నరేష్, హనుమా నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల నివారణకు చర్యలు చేపట్టారు. ప్రజల రాకపోకలకు అడ్డంకులు కలగకుండా చూడటంతో పాటు ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆక్రమణలు చేస్తే చలానాలు, కేసులు

రోడ్లపై అనధికారికంగా బండ్లు ఏర్పాటు చేయడం, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం, దుకాణాల ఎదుట బోర్డులు పెట్టి రాకపోకలకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు అవసరాన్ని బట్టి కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

ఆటోల పార్కింగ్ క్రమబద్ధీకరణపై దృష్టి

పాత బస్టాండ్ పరిసరాల్లో ఆటోల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించి, పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులు దృష్టి సారించారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు, వ్యాపారులు, ఆటో డ్రైవర్లు సహకరించాలని కోరారు.

రహదారి భద్రతకు సహకరించాలి

పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించకుండా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. పాత బస్టాండ్ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రహదారి పక్కనే పాడుబడ్డ బావి.. ఎప్పుడు ఏ ప్రమాదమో!









**భీమదేవరపల్లి, అక్టోబర్ 13,**

ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి:హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ పాడుబడ్డ బావి ప్రయాణికులు, వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో, మాట్ల ఎల్లయ్య ఇంటి వద్ద మూలమలుపును ఆనుకుని ఉన్న ఈ బావి వద్ద ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ గోడ లేదు.. హెచ్చరిక బోర్డు లేదు!

ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఈ బావికి రక్షణ గోడ లేకపోవడంతోపాటు ప్రమాదాన్ని సూచించే హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రధాన రహదారిపై నిత్యం వాహనాల రాకపోకలు కొనసాగుతుండగా, మూలమలుపు వద్ద ఉన్న బావి వాహనదారులకు ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వెలుతురు తక్కువగా ఉండటం వల్ల ఈ మార్గంలో కొత్తగా ప్రయాణించే వారు ప్రమాదాన్ని గుర్తించలేకపోయే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

ప్రమాదం జరిగాకే స్పందిస్తారా?

బావి ప్రమాదకరంగా ఉందని పలుమార్లు తెలియజేసినా సంబంధిత అధికారులు స్పందించడం లేదని స్థానికులు, ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాతే చర్యలు తీసుకుంటారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రజల భద్రతకు సంబంధించిన ఈ సమస్యపై నిర్లక్ష్యం వహించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకముందే గ్రామ పంచాయతీ పాలకవర్గం, సంబంధిత మండల అధికారులు స్పందించాలని ప్రయాణికులు, వాహన దారులు డిమాండ్ చేస్తున్నారు. బావిని సురక్షితంగా పూడ్చివేయడం లేదా తగిన రక్షణ ఏర్పాట్లు చేయడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రహ దారి వద్ద భద్రతా చర్యలు చేపట్టడం ద్వారా ప్రమాదాన్ని నివారించాలని కోరు తున్నారు.అధికారులు ఇప్పటికైనా స్పందించి, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపుతారా అన్నది వేచి చూడాలి.

## నాగ్‌పూర్‌లో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి గ్రీన్‌సిగ్నల్

**గౌడ భవనానికి స్థలం, తెలంగాణ తరహా నీరా పాలసీపై మహారాష్ట్ర మంత్రికి వినతి.. త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ**

**ప్రజానేస్తం జ్వాల -- మహబూబ్ నగర్ :**

మహారాష్ట్ర రెండో రాజధాని నాగ్‌పూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుతో పాటు గౌడ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, తెలంగాణ తరహా నీరా పాలసీని అమలు చేయాలని మహారాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి చంద్రశేఖర్ బవన్‌కుడేను తెలంగాణ మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, మహారాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు నారాయణ గౌడ్ కోరారు. సంఘం ప్రతినిధులతో కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ గౌడ్ నేమ్లేవర్, యూత్ ప్రెసిడెంట్ మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

